అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 26 ఏప్రిల్ 2023

పిడుగుపడి ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు



నార్నూర్ : మండలంలోని గుండాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆత్రం దేవ్‌రావ్(22) పిడుగు పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సుంగాపూర్ గ్రామంలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా వర్షంతో పాటు పిడుగు పడింది. దీంతో దేవ్‌రావ్ గాయపడ్డాడు. స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నాణ్యమైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపిపి కనక మోతుబాయి బాధితుడిని పరామర్శించారు. మంచి వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పరామర్శించిన వారిలో మాణిక్‌రావ్, సాహెబ్‌ఖాన్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ - రెబ్బెన

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని రాజారం గ్రామంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ బ్యాంకులో ఉన్న స్కీంలు, పథకాలు, రుణాలు, లోన్లు, ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలు, జీవనజ్యోతి బీమా యోజన పథకం, ఇన్సూరెన్స్ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. రైతులు లోన్లు తీసుకొనే విషయంలో మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా వచ్చి బ్యాంకులో కలవాలని, అదేవిధంగా సైబర్, డిజిటల్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిల నుండి వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మకుండా డైరెక్టుగా వచ్చి బ్యాంకులో సంప్రదించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సల్గు శ్రావణ్, క్యాషియర్ సురేష్, రాజు, జనార్ధన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ, రాజారం గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మక్కకు మద్దతేదీ..?

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు
- అకాల వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు ఆపసోపాలు
- కొనుగోలు చేయాలని రోడ్డెక్కుతున్న వైనం

మొక్కజొన్న పంటకు ప్రభుత్వ భరోసా కరువవుతోంది. పంట ఇంటికొచ్చి రోజులు గడుస్తున్నా విక్రయించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో పంటను అమ్ముకోలేక అన్నదాతలు తంటాలు పడుతున్నారు. తాజా అకాల వర్షాలతో పంటను కాపాడుకోవడం అన్నదాతలకు సవాల్‌గా మారుతోంది. వారం రోజులుగా వాతావరణం అనూహ్యంగా మారడం..ఒక్కసారిగా గాలిదుమారంతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో ఆందోళనకు గురవుతున్నారు. పొలాల్లో ఆరబెట్టిన పంటను రక్షించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు రైతులు నిల్వ చేసుకొనే పరిస్థితి లేకపోవడంతో గత్యంతరం లేక తక్కువ ధరకే ప్రయివేటు వ్యాపారులకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఆదిలాబాద్‌లో రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.



బోథ్ మండలం కన్గుట్ట గ్రామానికి చెందిన ఈ రైతు బీమరాజు. ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట వేశారు. 80క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయకపోవడంతో ఇంట్లో నిల్వ చేసుకోలేక..గత్యంతరం లేని పరిస్థితిలో ప్రయివేటు వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.1550చొప్పున విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.300తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోతే ఉమ్మడి జిల్లాలో అనేక మంది రైతులకు ఇదే పరిస్థితి వస్తుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దిలావర్‌పూర్



ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో ఇంటికొచ్చిన పంటను అమ్ముకోలేక..రోజుల తరబడి నిల్వ చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోగానే పొలాలకు పరుగులు పెడుతున్నారు. ఆరబెట్టిన మక్కలపై తాడిపత్రిలు కప్పుతూ రక్షించుకుంటున్నారు. కానీ వర్షం దాటికి అవి తట్టుకోలేకపోవడంతో పంట నీటిపాలవుతోంది. నిర్మల్ జిల్లాలో 16వేల ఎకరాలకు పైగా పంట వేయగా.. ఆదిలాబాద్ జిల్లాల్లో సుమారు 14వేల ఎకరాల్లో సాగు చేశారు. కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లోనూ వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. ఎకరానికి కనీసం 40క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నపంటను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు సర్కారు నుంచి పంట కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. మరోపక్క వ్యవసాయ విస్తరణ అధికారులు క్లస్టర్ల వారీగా పంటల నమోదు ప్రక్రియ సక్రమంగా చేపట్టకపోవడం మూలంగా ఈ సమస్య ఎదురవుతోందని తెలుస్తోంది. ఎన్ని వేల ఎకరాల్లో సాగు చేశారో ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక అందజేస్తే ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసేదని కొందరు రైతులు చెబుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా పంటల నమోదు చేపట్టడంతో తక్కువ విస్తీర్ణంలో సాగు చేసినట్లు నివేదిక పంపించినట్లు ఆరోపణలున్నాయి.

విక్రయించలేక ఆపసోపాలు..!

ప్రభుత్వం మొక్కజొన్న పంట క్వింటాల్‌కు రూ.1962 మద్దతు ధర కేటాయిచింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉంటే రైతులు ఈ ధరకు మక్కలను విక్రయించే అవకాశం ఉంటుంది. కానీ ఇంకా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రోజుల తరబడి క్వింటాళ్ల కొద్దీ పంటను ఇంటిలో నిల్వ చేసుకోలేక..తక్కువ ధరకు అమ్ముకోలేక తీవ్ర తంటాలు పడుతున్నారు. ఇంటిలో నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో కొందరు రైతులు ప్రయివేటు వ్యాపారులకు క్వింటాల్‌కు కేవలం రూ.1600చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కో రైతు క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400వరకు నష్టపోవాల్సి వస్తోంది. ప్రయివేటు వ్యాపారులు కూడా తొలుత క్వింటాల్‌కు రూ.2వేల వరకు కొనుగోలు చేయగా పంట ఎక్కువగా వస్తుండటంతో అమాంతం ధరను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరగ్గా.. పండిన పంటను కూడా పూర్తి ధరకు అమ్ముకోలేని దీనస్థితిని ఎదుర్కొవాల్సిన పరిస్థితి వచ్చింది.

పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు : కొప్పుల ప్రవీణ్, రైతు, దిలావర్‌పూర్



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో కోతలు పూర్తయిన మొక్కజొన్న పంటను కాపాడుకోవడం సమస్యగా మారుతోంది. అకాల వర్షాల కారణంగా పొలాల్లో ఆరబెట్టిన పంటంతా తడిసిపోతోంది. ఈ పంటను కాపాడుకోవడం కోసం రాత్రింబవళ్లు పొలాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రయివేటులో తక్కువ ధర ఉండటంతో నష్టం జరుగుతుంది. ప్రభుత్వం మా సమస్యపై దృష్టిసారించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదుకోవాలి.



రెండు రోజుల్లో స్పష్టత వస్తుంది : నాగేశ్వర్‌రావు, మార్క్‌ఫెడ్ డీఎం

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఈ విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

కేంద్ర విధానాలను ఎండగట్టాలి

- ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోంది
- దేశానికే ఆదర్శంగా రాష్ట్ర సంక్షేమ పథకాలు
- నియోజకవర్గంలో రూ.4500కోట్లతో అభివృద్ధి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్



సామాన్యుల నడ్డి విరిచేలా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వం తీరును ప్రజల్లో ఎండగట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రైల్వే, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుకు అప్పనంగా అమ్మేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ తొమ్మిదేండ్లలో ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.4500కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధులతో నియోజకవర్గంలో అన్ని రకాల మౌళిక వసతులు కల్పించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రతినిధుల సభను మంగళవారం జిల్లా కేంద్రం సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే జోగు రామన్న తెలంగాణతల్లి చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్య, వైద్యం, సామాజిక భద్రత, వ్యవసాయం, రైతు సంక్షేమం, దళిత సంక్షేమం, మహిళా శ్రేయస్సు, గిరిజన సంక్షేమం వంటి పద్దెనిమిది అంశాలతో కూడిన తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటిని బలపరుస్తూ ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తూ ఇంటింటికి సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం అనేక విమర్శలు చేస్తోందని మండిపడ్డారు. క్రేంద్రం చేతిలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో చర్చించామని పేర్కొన్నారు. మహిళల అకౌంట్‌లలో రూ.15 లక్షలు వేస్తామన్న బిజెపి బూటకపు హామీ, 2 కోట్ల మంది యువతకు ఉద్యోగాలు వంటి అంశాలపై చర్చించాలని సూచించారు. క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ బయటి దేశాల నుండి అధిక ధరకు దిగుమతి చేసుకోవడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. కీలకమైన రక్షణ శాఖను సైతం ప్రయివేటు సంస్థలకు అప్పచెప్పున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు కేంద్రం రూ. 1400 కోట్ల బడ్జెట్ ను కేటాయించిదని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.6 వేల కోట్ల బడ్జెట్ ను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయమని తీర్మానం చేసి పంపినా కేంద్రం నుండి స్పందన లేదని మండిపడ్డారు. చంద్రపూర్ నుండి ఉపాసనాల వరకు నాలుగు లైన్లతో జాతీయ రహదారిని నిర్మిస్తూ అక్కడి నుండి భోరజ్ వరకు రెండు లైన్ల జాతీయ రహదారిని ఎందుకు నిర్మిస్తున్నారన్న ఆయన ఈ విషయమై బీజేపీ నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి రోజున మత కల్లోలాలు సృష్టించే ప్రయత్నాలు చేసిన బీజేపీ నేతల కుటిల యత్నాలు పోలీసు విచారణలో బయటపడ్డాయని ఆరోపించారు. ప్రతినిధుల సభ సందర్భంగా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, జెండాలతో ఆ పరిసరాలు గులాబీమయంగా మారాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ గోడం నగేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్‌రంజానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అజయ్, మహిళా పట్టణ అధ్యక్షురాలు స్వరూపరాణి, నాయకులు మెట్టు ప్రహ్లాద్, యూనిస్‌అక్బానీ, సాజిదొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



నేరడిగొండ : మండలంలోని కుంటాల జలపాతానికి వెళ్లే దారిలో రూ.3.28 కోట్లతో నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన నిర్మాణ పనులను మంగళవారం బోథ్ శాసనసభ్యులు రాథోడ్ బాపురావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, నేరడిగొండ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ రవీందర్, మండల నాయకులు ఉన్నారు.

తెలంగాణలో తిరుగులేని అభివృద్ధి



నవతెలంగాణ-బోథ్

రాష్ట్రంలో తిరుగులేని అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాలు ఎగురవేశామన్నారు. 14 సంవత్సరాలు కష్టపడి తెలంగాణ రాష్ట్రం సాధించిన అనంతరం రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రోడ్డు లేని గ్రామాలకు రోడ్డు నిర్మించి తాగు, సాగు నీరు కల్పించేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్, రైతుబంధు అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని వినతి

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తమను రెగ్యులరైజ్ చేయాలనీ మాజీ జడ్పీటీసీ లోలం శ్యామ్ సుందర్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు భుజంగరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, లోకేశ్వరం సర్పంచ్ కపిల్ సౌజన్య, పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీవాసుల సమస్యలు తీర్చాలని రాస్తారోకో

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని సాయినగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలని బిజెపి ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ మాట్లాడుతూ సాయినగర్ కాలనీ వాసులకు శ్మశాన వాటిక లేక కిలోమీటర్ల దూరంలో దహన సంస్కారాలు చేస్తున్నారన్నారు. రేషన్ షాపు లేక పట్టణానికి వెళ్లడం కష్టంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అతికొద్దీన్‌కు అందజేశారు. 30 రోజులలో సమస్యలను పరిష్కరించకపోతే పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మానాల రాజు, అవునూరి శ్రీనివాస్, జక్కుల వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఒరిగిందేమిటి?

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని ఎమ్మెస్ఎఫ్ జాతీయ కార్యదర్శి, ఓయూ జేఏసీ నాయకుడు బిక్కి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో లక్షలాది నిరుద్యోగుల జీవితాలు అయోమయంలో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ మాత్రం వారికి భరోసా కలిగించే పనులు చేపట్టకుండా ఆత్మీయ సమ్మేళనాలు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజలకు ఒరిగేది ఏమీలేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువత పట్ల ఎమ్మెల్యే వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, లేనట్లైతే భవిష్యత్‌లో మూల్యం తప్పదని పేర్కొన్నారు.

ఓటరు లిస్టుపై రాజకీయ పార్టీల సమీక్షా సమావేశం

నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలో ఎలక్ట్రోల్ ఓటర్ లిస్టుపై తహసీల్దార్ శ్రీపాల్ రాజకీయ పార్టీలతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టులో తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదులో రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, బీఎస్పీ అధ్యక్షుడు ఆత్రం సాయి హాజరయ్యారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-బోథ్

మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని సోనాల గ్రామంలో ఖబ్రస్థాన్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి చాలా కృషి చేస్తోందన్నారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ప్రశాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అఖండ హరే రామ సంకీర్తన

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలం రవీంద్ర నగర్ -1 గ్రామంలోని ఖాందిశికుల ఆధ్వర్యంలో మంగళవారం హరే రామ హరే కృష్ణ అఖండ సంకీర్తన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సిర్పూర్ బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.పాల్వాయి హరీష్‌బాబు రాధాకృష్ణులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరులే వానుపటేల్, ప్రధాన కార్యదర్శులు గణేష్ రప్తాన్, ఉమా మహేష్, సీనియర్ నాయకులు ఎల్మలే మల్లయ్య, బండు పటేల్, డుబ్బుల రావు, రమేష్, బలరాం, శంకర్, చప్పిడి శ్రీను, రవి, వేములవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో భారీ వర్షం

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఉట్నూర్ పట్టణంతో పాటుగా ఎక్స్‌రోడ్డు, హస్నాపూర్, శ్యాంపూర్, లక్కెటిపేట, పులిమడుగు, ఎందా, సాలెవడా కె.బీ, తాండ్ర, బాబాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులతో పాటుగా మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో పంటలు దెబ్బతినడం, ఇంటి పైకప్పులు గాలికి లేచిపోవడంతో అవస్థలు పడ్డారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మంగళవారం ఆకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సిరికొండ నుండి ఇచ్చోడ వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద చెట్టు ఈదురు గాలులకు రోడ్డుపై పడిపోయింది.దీంతో రాకపోకలకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ నీరేష్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని జేసీబీ సహాయంతో తొలగించారు.ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనాలు భయభ్రాంతులకు గురయ్యారు.

తలమడుగు : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాళ్లతో కూడిన వర్షం కురిసింది. ఇదే సమయంలో పిడుగు పాటుతో సుంకిడి గ్రామానికి చెందిన అజయ్ రెడ్డి అనే రైతు ఎద్దు మృతి చెందగా కుచలాపూర్, సుంకిడి, నందిగామ, పల్లి(కె), పల్లి(బి), లింగి, బరంపూర్, ఝరి తదితర గ్రామాలలో రాళ్ల వర్షం కురవడంతో రబీజొన్నతో పాటు ఇతర పంటలు తడిసిపోయాయి. ఉరుములు, మెరుపులతో భారీ శబ్దాలు పెద్ద ఎత్తున రావడంతో మండల ప్రజలు పిడుగులు పడతాయేమోనని భయభ్రాంతులకు గురయ్యారు. రబీ జొన్న పంటలు చేతికొచ్చే దశలోనే కళ్ళముందే రాళ్ల వర్షానికి నేలకొరిగాయని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాలలో బలమైన గాలులు వీయడంతో ఇండ్ల పైకప్పులు లేచిపోగా కొన్ని గ్రామాలలో విద్యుత్ స్తంభాలు చెట్లు నేలకొరిగాయి. అకాల వర్షం కురవడంతో అధికారులు సర్వేలు నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ - కౌటాల

మండలకేంద్రంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వసంత్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ యువకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మండలకేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు సకారాం జెండా ఎగరవేశారు. అనంతరం సలుగుపెల్లి గ్రామం నుండి బీఆర్ఎస్ కార్యకర్తలు, జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసి కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలో నిర్వహించే బీఆర్ఎస్ క్రియాశీల సమావేశానికి బయలుదేరి వెళ్లారు.

పెంచికల్‌పేట్ : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం మండలంలోని కొండపెల్లి, ఎలుకపెల్లి, పెంచికల్‌పేట్, చెడ్వాయి గ్రామాల్లో నిర్వహించారు. మండల నాయకులు బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్ సంజీవ్, మేకల కమల, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఖైరాత్, చౌదరి శ్రీనివాస్, ఎస్‌కె బాబు, ఇస్తారి, లచ్చన్న పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలో మంగళవారం భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లోనూ పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో ఎంపీపీ డుబ్బుల నానాయ్య, జడ్పీటిసి డుబ్బుల శ్రీదేవి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు డుబ్బుల వెంకన్న, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బింకారి నారాయణ, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటిలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పట్టణాధ్యక్షుడు మోర్లె నరేందర్ మంగళవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజానికమంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో గోలేటి గ్రామ సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బోదాస్ దేవానంద్, యూత్ అధ్యక్షుడు గంగిశెట్టి సురేష్, వార్డుసభ్యులు పరికిపండ్ల సతీష్, టీబీజీకేయస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, సెంట్రల్ చీఫ్ కార్యదర్శి సంఘం ప్రకాష్‌రావు, టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, సాంబగౌడ్, బీఆర్ఎస్ నాయకులు తోట లక్ష్మణ్, కంబాల శ్రీను, కుంపుల విమలేశ్, సుధాకర్, సతీష్, కృష్ణ, పార్వతి, అశోక్, లింగమూర్తి, శంకరమ్మ పాల్గొన్నారు. మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే మండలంలోని గంగాపూర్, కిష్టాపూర్, నారాయణపూర్, తుంగెడ తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు బీఆర్ఎస్ ఇంద్రవెల్లి : మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మారుతి డోంగ్రె, సోఫియాన్, అంజద్, దేవ్‌పూజే మారుతి, కోరెంగ గాంధారి, టేహరే గణేష్,నగేష్,సర్కాలే శివాజీ పాల్గొన్నారు.

పోషకాహారలోప నివారణకు పకడ్బందీ చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నిర్మూలించడం కోసం పోషకాహారం అమలుకు సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా శిశు సంక్షేమ వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఢిల్లీ నుంచి వచ్చిన ఏఎంసి ప్రతినిధులు, అంగన్వాడీ సిడిపిఓలు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా 900 కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం అందించడం జరుగుతుందని, ప్రతి కేంద్రంలో బాలామృతం పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రతి వారం పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి, బరువు తక్కువ ఉన్న పిల్లలు ఎదుగుదలకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి కేంద్రాన్ని సూపర్వైజర్ల ద్వారా సిడిపివోలు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వం ద్వారా ప్రతి కేంద్రానికి నాణ్యమైన సరుకులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భిణులకు పోషకాహారం అందించేందుకు పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందని, గర్భిణులకు, పిల్లలకు పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలతో వండిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఢిల్లీ నుండి వచ్చిన ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు రిమ్స్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి డైస్ కేంద్రంలో బుధవారం 0-18 ఏండ్ల పిల్లలకు గ్రహణమొర్రి, (పెదవుల చీలిక, అంగిలి చీలిక) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, ఆర్బీఎస్‌కే సమన్వయకర్త వైసీ శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రి వైద్యుడు శ్రీనివాస్ తన బృందంతో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
బుధవారం 26 ఏప్రిల్ 2023

ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరగనుంది. పదో తరగతి పరీక్షలకు 987 మంది, ఇంటర్ పరీక్షలకు 549 మంది పరీక్షను రాయనున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖధికారి ప్రణీత సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మూడోసారి కూడా కేసీఆరే సీఎం

- ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మూడోసారి కూడా కేసీఆరే సీఎం అని ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ ప్లీనరీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో కరువు ప్రాంతంగా ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణతో రైతులు సంవృద్ధిగా పంటలు పండించుకుంటున్నారని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ గ్రామానికి తాగునీరు అందుతోందని అన్నారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, బీడీ కార్మికులకు పింఛన్, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలను ఆదుకుంటున్నారని వివరించారు. పార్టీకి కార్యకర్తలే ప్రధానబలమని తనకు రెండు పర్యాయాలు అండగా ఉండి గెలిపించడాన్ని తాను ఎన్నటికీ మరిచిపోనని గుర్తుచేశారు. మూడోసారి కూడా తనకు మద్దతుగా ఉండి గెలిపించాలని కోరారు. ఉద్యమ సమయంలో లేని కొందరు టికెట్ పేరుతో పార్టీలో గ్రూపులకు బీజం వేస్తున్నారని అలాంటి వాళ్ల మాటలు నమ్మద్దన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరాభినాలతో తాను కూడా మూడోసారి ఎమ్మెల్యేను అవుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అంకం రాజేందర్, ఖలీల్, రాజగంగన్న, రామూనాయక్, చరణ్, శోభన్, దివాకర్, గొర్రె గంగాధర్, పుప్పాల శంకర్, వెంకాగౌడ్, ఆయా మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యం అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని 11వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ నగర్, జేకే నగర్, విద్యానగర్ కాలనీవాసులు కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, కౌన్సిలర్స్ కావాలి సంతోష్, నాయిని సంతోష్, పరిమి సురేష్, కౌన్సిలర్ కుర్మ శ్రీనివాస్, షబ్బీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు, శెట్టి కాలనీవాసులు, పెద్దలు ఎంసీ గంగాధర్, రాజాగౌడ్ నర్సయ్య వార్డు స్పెషల్ మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది, డాక్టర్లు, హాస్పిటల్, సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఐకేపీ వీఓఏల పట్ల ప్రభుత్వం వివక్షతను విడనాడి సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ విజయ్, మండల అధ్యక్షుడు వాగ్మారే గోవింద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో పాల్గొని వారు మాట్లాడారు. కండ్లకు నల్ల రిబ్బిన్ కట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామ స్థాయిలో 17,605 మంది వీఓఏలు గ్రామ సంఘ సహాయకులుగా పని చేస్తున్నారని, గత 20 సంవత్సరాల నుండి గ్రామాల్లో మహిళా అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి ఎనిమిది ఏండ్లు గడుస్తున్నా వీఓఏల బతుకులు మారడం లేదని అన్నారు. సేర్ప్ నుండి రూ.3వేల 900 గౌరవ వేతనం మాత్రమే చెలిస్తున్నారని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఐకేపీ వీఏఓలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని అన్నారు. రూ.10లక్షల ఆరోగ్యభీమా కల్పించాలని అన్నారు. సేర్ప్ నుండి ఐడి కార్డు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో వీఓఏలు శారదబాయి, చిత్రు, తాతేరావ్, దోండుబాయి, పరమేశ్వర్, విద్యాన్, కాంతాబాయి, మాన్కు ఉన్నారు.

సూపర్ స్పెషాలిటీలో అందని సేవలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రూ.150 కోట్లు వెచ్చించి, అత్యాధునిక సౌకర్యాలు, మెషినరీలు, కార్పొరేట్ ఆస్పత్రికి తీసిపోని విధంగా 210 పడకలు, 50 ఐసీయూ పడకలు, 7 ఆపరేషన్ థియేటర్లతో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అలంకార ప్రాయంగా మారి పేదలకు ఉపయోగపడనిదిగా మిగిలిందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాఖ మంత్రి అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. డయాలసిస్ కోసం ఆధునిక మెషీన్లు 10, ఉండి కూడా డాక్టర్ లేకపోవడంతో, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి కావాల్సిన సెటప్ ఉందని అన్నారు. కానీ డాక్టర్‌లు లేక సేవలు అందడం లేదని అన్నారు. మంత్రి హరీష్‌రావు గత ఏడాది ప్రకటించిన ఎంఆర్ఐ ఇంకా రాలేదని అన్నారు. హాస్పిటల్‌లో ఔట్ సోర్సింగ్ పోస్టు అమ్ముకోవడం మీద ఉన్న శ్రద్ధ డాక్టర్లను నియమించడం మీద లేకపోవడం జోగు రామన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. లిమ్కా బుక్ కోసం కేసీఆర్‌నీ కలిసిన రామన్న వెంటనే డాక్టర్ల కోసం సీఎంని కలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇచ్చోడ

హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకై ఈ నెల 29న చలో హైదరాబాద్ సంబంధించిన గోడప్రతులను మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, స్థానిక కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలందరికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 55సంవత్సరల వయస్సుపై బడిన హమాలీలకు నెలకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. హమాలిలందరికి ఇంటి స్థలాలు ఇచ్చి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను నెరవేర్చేందుకు చలో హైదరాబాద్ హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకై కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, సహాయ కార్యదర్శి పవర్ జితేందర్, హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బాక సుభాష్, ప్రధాన కార్యదర్శి సిరిసిల్ల భూమయ్య, ఉపాధ్యక్షుడు అన్నెల రమేష్, కార్మికులు పోశెట్టి, మచ్చ గంగయ్య, రవి, భూమన్న, జుట్టు మల్లేష్, సాయన్న పాల్గొన్నారు.

అట్రాసిటి కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని వేగవంతం చేయాలనీ సూచించారు. బాధితులకు సకాలంలో న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 12 కేసులు నమోదు కాగా, ఆదిలాబాద్ డివిజన్‌లో 8, ఉట్నూర్‌లో 6 నమోదు అయ్యి విచారణ దశలో ఉన్నాయని తెలిపారు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని ఎస్పీ వివరించారు. అంతకుముందు కేసుల వారిగా సంబంధించిన అంశాలను పోలీస్, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్, ఎస్పీలు సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఐటీడీఏ డీడీ



డా.దిలీప్ కుమార్, ఆర్డీఓలు రమేష్ రాథోడ్, కదం సురేష్, డీఎస్పీలు ఉమేందర్, నాగేందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీతకుమారి, రాజలింగం, కృష్ణవేణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, ఐటీడీఏ ఏఓ రాంబాబు, ఉట్నూర్ ఎంపీడీఓ తిరుమల, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిరికొండ

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బియ్యాల మల్లేష్ జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు బషీర్, గంగాధర్, గొర్ల రాజన్న, రాములు, నడ్పి మల్లేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

నార్నూర్:మండలంలోని ఖైర్‌డాట్వా గ్రామపంచాయతీ పరిధిలోని బొప్పాపూర్ గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కనక సేవంత ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ధుత్‌రాజ్ మధుకర్, కనక సత్యనారాయణ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముధోల్:మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. మంగళవారం ముధోల్‌తో పాటు, చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, బొరిగాం, మచ్కల్‌తో పాటు ఆయా గ్రామాలలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని నాయకులు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ దూసుకెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు రవిందర్‌రెడ్డి, మురళి దిగంబర్, అరిపోద్దీన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-తాంసి

ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిఖిల్‌రాజ్ అన్నారు. మంగళవారం భీంపూర్ మండల పరిధిలోని గ్రామంలో జాతీయ కీటక జనిత కార్యక్రమంలో బాగంగా ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఇండ్ల పరిసర ప్రాంతాలను ఆరోగ్య సిబ్బందితో కలిసి తిరిగి పరిశీలించారు. పలు సూచనలు చేసి దోమలు పుట్టకుండా, కుట్టకుండా ఉండేందుకు తగు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురికినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. మంచినీటి నిల్వలపై మూతలను ఉంచాలని అన్నారు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలని అన్నారు. ఇంటి ఆవరణలో మురికి నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. రాత్రి పడుకోవడానికి ముందు కుంపటిలో వేపాకు వేసి వచ్చిన పొగతో ఇంట్లో దోమలు లేకుండా చూసుకోవాలి గర్భిణీ బల్బుపైన పెట్టె జెట్ బిల్లలను గాని, ఆలౌట్ వంటి రసాయనాలుగాని ఉపయోగించి మలేరియా జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు. జ్వరం వచ్చిన వెంటనే మా ఆశా కార్యకర్తలను గాని, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించి రక్తపూతలను ఇచ్చి



ఆరోగ్యాన్ని పరీక్షించుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్ ఆరోగ్య కార్యకర్తలు, జానాబాయి, విష్ణుకుమార్, భీంపూర్ ఉపకేంద్ర ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ లేక గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు



నవతెలంగాణ-నార్నూర్

బ్రేకర్స్ లేక గ్రామాల్లో తరుచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నెల వ్యవధిలోనే నాలుగు రోడ్డు ప్రమాదాలు ఒకరు మృతి చెందారని తెలిపారు. రోడ్లు వేసి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనితో గ్రామాల్లో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల స్పీడ్ బ్రేకర్‌లు, బోర్డు సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. .హస్నాపూర్ క్రాసింగ్ నుండి నార్నూర్ వెళ్లే మెయిన్ తాడిహత్నూర్ ఎస్సీకాలనీ రహదారిపై స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయక పోవడంతో నెల వ్యవధిలోనే నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆటో బైక్ ఢీ కొని పుసిగూడ గ్రామానికి చెందిన మారు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన అనసూయబాయిని ఆటో ఢీ కోని గాయాల పాలైంది. ఇలా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయక పోవడంపై గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ లహుజి సాల్వే యూత్ సభ్యులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, బోర్డు సూచికలు ఏర్పాటు చేయాలని అన్నారు.

సీఐ భవనానికి భూమి పరిశీలన

నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌లోని సర్కిల్ పోలిస్ స్టేషన్ కార్యాలయం భవనం నిర్మాణం కోసం స్థలాన్ని భైంసా అడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల స్థానిక గురుకుల పాఠశాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పోలిస్ సీఐ కార్యాలయం కోసం కేటాయించారు. దీంతో కేటాయించిన స్థలాన్ని అడిషనల్ ఎస్పీ పరిశీలించి, పలు వివరాలను సీఐ వినోద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

మామిడి రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం

ఉరేసుకొని మామిడి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కల్లేడ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నాలుగు రోజుల కింద కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులకు మామిడి పంట పూర్తిగా రాలిపోయి దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతు కలత చెందిన రైతు బిర్యారి లచ్చన్న (46) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి తోడు అప్పుల కావడంతో తీవ్ర మనస్థాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య బీర్యారి రాజవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నర్సరీపై నిర్లక్ష్యం వహించొద్దు



నవతెలంగాణ-నార్నూర్

నర్సరీపై నిర్లక్ష్యం వహించవద్దని నిర్వాహకులను అదనపు డీఆర్డీఓ రవీందర్ రాథోడ్ సూచించారు. మంగళవారం మండలంలోని గుండాల, మహాగావ్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో నాటిన మొక్కలను పరిశీలించారు. జామడ, మహాగావ్, గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో కూలీలు నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. మాస్టర్‌లో పొందుపర్చిన కూలీల వివరాలను సేకరించారు. పని చేయని కూలీల పేర్లు మాస్టర్‌లో నమోదు చేయవద్దని అన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం టీఏ, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించి, లేబర్ మొబలైజేషన్, లేబర్ పేమెంట్ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. వారి వెంట ఎంపీడీఓ కావల రమేష్, ఏపీఓ సురేందర్, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన గంధం వెంకటి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా మంగళవారం విషయం తెలుసుకొని అంబారిపేట్ మాజీ సర్పంచ్ ఇంద్రసేనరెడ్డి ఇంద్రసేన యూత్ అసోసియేషన్ సభ్యులు మృతుడి కుంటుంబ సభ్యులను కలిసి వారిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన నర్ర భూమేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో నర్ర భూమేష్ ట్రీట్‌మెంట్ కోసం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేన అసోసియేషన్ సభ్యులు టి.రమేష్, ఏ.మల్లేష్, ఏ.మధు, కే.రమేష్, ఎస్.నారాయణ, రాజన్న, కే. వెంకన్న, పి.సతీష్, రాజు పాల్గొన్నారు.

నేటి రేవంత్ పర్యటన విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ సమరభేరి మోగించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వస్తున్నాడని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ శ్రావణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుండి ఓ విడియో విడుదల చేశారు. ఈ నిరుద్యోగ సమరభేరికి నిరుద్యోగులు, ప్రజలు, అన్ని విభాగాల శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్‌టౌన్:ఆదిలాబాద్ పట్టణంలో నిరుద్యోగ సమరభేరి కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హజరుకానున్న నేపథ్యంలో సభ విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే నిరుద్యోగులకు అడ్డాలైన పలు స్టడీ సర్కిల్‌లు, గ్రంథాలయం, వ్యాయమశాలలు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలలో మంగళవారం నిరుద్యోగ యువతను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కలిశారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించే నిరుద్యోగ సమరభేరి, కార్నర్ మిటింగ్‌కు విద్యార్థి, నిరుద్యోగ యువతీ, యువకులందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

ఉట్నూర్:కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరుద్యోగ సమరభేరిని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి నిరుద్యోగులను అడుగడుగునా మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు. పేరుకే ప్రభుత్వ నోటిఫికేషన్లు జారీ చేసి ఎదో ఒకటి కొర్రీలు పెట్టి పెండింగ్‌లో పెడుతుందన్నారు. స్వరాష్ట్రం వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని భావించినప్పటికీ ఆశలన్నీ ఆడి ఆశాలైయ్యాయని అన్నారు. ఇటీవల విడుదల చేసిన టీఎస్ పీఎస్సీలో లికేజీతో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోందని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యలపై సమరభేరి నిర్వహిస్తున్నారని అన్నారు. నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరుద్యోగ సమరభేరికి అధిక సంఖ్యలో యువత, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జగదీష్, దేవానందం పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 26 ఏప్రిల్ 2023

కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం(కె) గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం శిబిరం నిర్వహణపై వైద్య అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలతో గ్రామాల్లో కంటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధితో పాటు తెలంగాణ ప్రజలు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించి ముందుకు వెళుతుందన్నారు. ప్రతి ఒక్కరు వచ్చి కంటి పరీక్షలు చేసుకొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, సర్పంచ్ సపాట్ శంకర్, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, ముత్యంపల్లి సర్పంచ్ ఆడె బాద్, ఉప సర్పంచ్ పిట్టల సుమన్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, వైద్యురాలు శ్రీదివ్య, కార్యదర్శి శ్వేత పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఘనంగా వార్షికోత్సవం

నవతెలంగాణ-తాండూర్



మండలంలో గల మాదారం సెక్టర్ పరిధిలోని మాదారం-2 అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాదికాలంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారుల విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. అనంతరం వారికి ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన అసెస్మెంట్ కార్డులు అందజేశారు. కేంద్రాల్లో అందుతున్న పథకాలపై చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల బరువు, ఎత్తు, జబ్బా కొలతలు తీసి పిల్లలు ఏ గ్రేడ్‌లో ఉన్నారో వారి తల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, మీనా పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించుకోండి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రజలు ఎవరైన తమ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నట్టయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పూర్తి వివరాలు పొందుపరిచినట్టయితే పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరి చేసుకోవచ్చని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆదేశాల ప్రకారం సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న కారం సత్యనారాయణ అనే వ్యక్తి యొక్క ఆధార్‌కార్డును, సంబంధిత మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెబ్‌సైట్‌లోకి అప్లోడ్ చేయగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వాడుతున్న వ్యక్తి వివరాలను తెలుసుకొని అతని నుండి మొబైల్‌ను రికవరి చేసి బాధితుడికి అప్పగించినట్టు ఆయన తెలిపారు. ప్రజలు ఈ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో గత తొమ్మిది రోజులుగా వీఓఏల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెకు మంగళవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బైసమల్లేష్ మాట్లాడుతూ వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, వారికి ప్రమాదభీమా, సాధారణభీమా సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.26000లు చెల్లించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పదోన్నతి కల్పించి సెర్ప్ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు ఏట మధుకర్, ప్రధాన కార్యదర్శి గణపురం సంతోష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుర్మా లస్మయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎనుముల వెంకటేష్ దొబ్బల సంతోష్, చారి పాల్గొన్నారు.

రచయిత జన్మదిన సందర్భంగా రక్తదానం



నవతెలంగాణ-తాండూర్

ప్రముఖ సినీ గేయ రచయిత తాండూరు మండలం మాదారం నివాసి తైదల బాపు జన్మదిన సందర్భంగా మంగళవారం మాదారంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.బాపు యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన అనంతరం సంతోష్ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ నిమ్మరసం పంపిణీ చేశారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాపుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాదారం సర్పంచ్ సాగరిక మంగీలాల్ మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం, తాండూర్ సర్పంచులు డి.సాకరిక, పి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ ఇట్యాల కిషన్‌కు సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా తమ ప్రొహిబిషన్, పీరియడ్ పూర్తి అయినప్పటికీ తమను ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని బెనిఫిట్స్ తమకు వర్తింపజేసే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, బజాజ్ శ్రీకాంత్ సాగర్, మహేష్, విష్ణు, మధు, రమేష్, ప్రశాంత్, సంతోష్, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు రాజ్యమే బీఆర్ఎస్ లక్ష్యం

- పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణరావు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు తిప్పి కొట్టాలి
- జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవ లక్ష్మి
- ఘనంగా నియోజకవర్గస్థాయి ప్రతినిధుల సభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆబ్ కీ బార్ కిసాన్ సర్కార్ బీఆర్ఎస్ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పునరుద్ఘాటించారు. జిల్లా కేంద్రంలోని తాటియా గార్డెన్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సభకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మీతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజు చేయడమే తమ పార్టీ లక్ష్యం అన్నారు. దాని కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్లీనరీ సభలలో పార్టీ పుట్టుక ఆవిర్భావం అభివృద్ధి గురించి చర్చించాలని 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం ఒక చరిత్ర అని అన్నారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు, ఆంధ్ర పాలకుల దోపిడీ నివారణ కోసం తెలంగాణ సాధన అత్యంత ఆవశ్యకమైందన్నారు. "సీత శోకం లంక దహనానికి ఎలా కారణమైందో" తెలంగాణ ప్రజల బాధలు తెలంగాణ ఆవిర్భావానికి కారణమయ్యాయన్నారు. చరిత్ర గాయాల నుంచి పుట్టిన ఉద్యమ వీరుడు కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ సాధన తర్వాత గత ప్రభుత్వాలు అందించని 24 గంటల విద్యుత్ సాగునీరు, పంఛన్‌తో పాటు అనేక రకాల సంక్షేమ పథకాలు అందించామన్నారు. సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతూ కేసీఆర్ ఇంట్లో నుంచి ఇవ్వడం లేదని అంటున్నారని గతంలో కాంగ్రెస్, బీజేపీలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్న వాటిలో సగం కూడా లేవని తెలిపారు. ప్రజలు పన్ను రూపంలో చెల్లించిన సొమ్మును తిరిగి వారికే చెల్లించాలని సంకల్పంతో సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు



చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు పూర్తిగా రద్దు చేస్తారని జోస్యం చెప్పారు. తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్ఎస్ పార్టీ అని దీనికి నిదర్శనమే మహారాష్ట్రలో నిర్వహించిన సభకు వేల సంఖ్యలో ప్రజలు హాజరు కావడం అన్నారు. రానున్న రోజుల్లో అబద్ధాలు చెప్పే బీజేపీ, కాంగ్రెస్ మాటలు తిప్పి కొట్టాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ పార్టీ సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న పోస్టులను తిప్పికొట్టాలన్నారు. తమ పార్టీ గత తొమ్మిది సంవత్సరాల్లో చేసిన అభివృద్ధిని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందని ఎవరు కూడా నిరాశపడకూడదన్నారు. షర్మిల, విజయమ్మలు తెలంగాణలో ముఖ్యమంత్రిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పక్క రాష్ట్రంలో వాళ్ల పార్టీ అధికారంలో ఉండగా అక్కడ విడిచి ఇక్కడ ఏం చేయడానికి వచ్చారని ప్రశ్నించారు. పోలీసులపై వారి ఇరువురు చేయి చేసుకోవడానికి తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిరుద్యోగ యువతకు ఎన్నో ఉద్యోగాలు కల్పించామని అన్నారు. బట్టి విక్రమార్క పర్యటనలో తెలంగాణ అభివృద్ధి చెందలేదని ఆరోపించారని రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల ఆవిర్భావంతో పరిపాలన క్షేత్రస్థాయిలోకి వచ్చిందని అభివద్ధి ఆకాశాన్నంటిందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు అభివృద్ధితోనే సమాధానం చెప్పాలని సూచించారు. ప్రతినిధుల సభ సందర్భంగా మొత్తం 23 తీర్మానాలను ప్రవేశపెట్టి వాటిని ఆమోదింప చేశారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళు అర్పించి సభస్థలి ముందు ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జడ్పీటీసీలు నాగేశ్వరరావు, సంతోష్ కుమార్, అజయ్ కుమార్, ద్రుపదాబాయి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

హమాలీల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జన్నారం బజార్ హమాలీ వర్కర్స్ అడ్డా వద్ద ఏప్రిల్ 29న జరిగే చలో లేబర్ కమిషనర్ ఆఫీస్, ధర్నా వాల్ పోస్టర్స్‌ను సీఐటీయూ నాయకులు మంగళవారం విడుదల చేశారు. సీఐటీయూ నాయకుడు కూకటికారి బుచ్చయ్య ఆధ్వర్యంలో హమాలీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ హమాలీలందరికీ భవన నిర్మాణ కార్మికుల వలె, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. 50కిలోలకు మించిన బరువులు నిషేధించాలని, పనిగంటలు, పని భద్రత, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పెన్షన్ వంటి చట్టబద్ధహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గోదాంలో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు బోయిని సత్తన్న, బోయిన గంగన్న, సిరవేణి సత్తన్న, కారుపాకల హరీష్, మేకల నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు, వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని మాదారం శ్రీఇంక్లైన్ నీలయపల్లి మాదారం గ్రామపంచాయతీలలో వెలసిన అక్రమ వెంచర్లు లేవట్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు రామగౌని మహిధర్‌గౌడ్ మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ వెంచర్లు లేఔట్లు విచ్చలవిడిగా వెలుస్తున్న చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. మండలంలో అనుమతులు లేకుండా వెలుస్తున్న వెంచర్లపై నిర్మాణాలపై తక్షణమేచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న వీఓఏలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు నౌనూరి సుధీర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి విష్ణు కళ్యాణ్, మండల ఉపాధ్యక్షులు పుట్ట కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేవైఎం మండల కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

డార్విన్ పరిణామ వాదాన్ని తొలగించడం సరికాదు



నవతెలంగాణ-మంచిర్యాల

పాఠ్యపుస్తకాలలోంచి డార్విన్ పరిణామ వాదాన్ని తొలగించాలంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తిరోగమన చర్య అని, సత్వరమే ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వేదిక అధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం మనువాద విధానాలను అవలంబిస్తూ శాస్త్రీయ విజ్ఞానాన్ని వ్యతిరేకించే ధోరణిని అవలంబిస్తున్నదని ఆరోపించారు. మానవజాతి ఆవిర్భావం గురించి శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ప్రపంచమంతా ఆమోదిస్తుంటే మన పాలకులు బావిలోని కప్పలా వ్యవహరిస్తామంటే కుదరదని వారు పేర్కొన్నారు. ప్రజల్లో మూఢత్వం పెరిగితేనే తమ అభివృద్ధి నిరోధక విధానాలు కొనసాగుతాయనే స్వార్థ బుద్ధితో పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51-ఏ హేతువాద భావజాలాన్ని పెంపొందించడానికి పాలకులు చర్యలు తీసుకోవాలని నిర్దేశిస్తున్నదని వారు పేర్కొన్నారు. పరిణామవాదాన్ని సిలబస్ నుంచి తొలగించడం రాజ్యాంగ వ్యతిరేక చర్యేనని వారు విమర్శించారు. ప్రజలందరూ సమానులేనని సైన్స్ ప్రబోధిస్తున్నదని, భరత మాత బిడ్డలలో హెచ్చుతగ్గులు సృష్టించే మనువాద భావజాలాన్ని అంబేద్కర్ అందించిన రాజ్యాంగం తిరస్కరించిందని వారు పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో మనువాద తిరోగమన విధానాలను ప్రవేశ పెట్టే చర్యలను ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిష్టయ్య, పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక నాయకులు పలిగిరి కనక రాజు, బీసీ ఐక్య వేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచయ్య, ద్రవిడ ఉద్యమ వేదిక నాయకులు కొమ్ముల శ్రీనివాస్, భారత్ బచావో కమిటీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి మనోహర్, కైలాసం, సమ్మయ్య, ఇబ్రహీం వివిధ దళిత బహుజన ప్రజాస్వామిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యకు పరిష్కారం ఆత్మహత్యలు కావు

- మంచిర్యాల జిల్లా జడ్జి బత్తుల సత్తయ్య



నవతెలంగాణ-హాజీపూర్

రైతులు ఆత్మహత్యలు చేసుకోవటం సమస్యకు పరిష్కారం కాదని మంచిర్యాల జిల్లా జడ్జీ బత్తుల సత్తయ్య అన్నారు. మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గుడిపేట్‌లో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పనతో కలిసి ప్రారంభించారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు భీమా వంటి పథకాలతో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. అయిన కానీ నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు నష్టాలు చవి చూస్తున్నారన్నారు. రైతు రెండు చేతిలో బురదలో పోతేనే నలుగురికి అన్నం దొరుకుతుందన్నారు. అలాంటి రైతులు చైతన్యవంతులు కావాలన్నారు. హక్కుల కోసం పోరాడాలన్నారు. రేపటి సమాజం కోసం రైతును కాపాడుకునే బాధ్యత మనందరిది అన్నారు. చిన్న భూమి, పంట సమస్యలతో రైతులు జీవితాలు నష్టం చేసుకుంటున్న సందర్భంలో రైతుల కోసమే న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతే రాజు, జైజవాన్ జైకిసాన్ అనే నినాదాలు చేశారు. జిల్లా వ్యవసా యాధికారి కల్పన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసమే న్యాయ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, జిల్లాలో మొదట గుడిపేట్, సీతారంపల్లిలో రెండు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. నకిలీ ఎరువులు, విత్తనాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్‌తో కలిసి ఆకస్మిక దాడులు చేయనున్నట్లు తెలిపారు. భూ తగాదాలు, పంట సాగు, మార్కెటింగ్‌లో అవసరమైన సలహాల కోసం కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జ్ ఉదయ్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్త సత్తయ్య, ఏడీఏ అనిత, ఏఓ రజిత, న్యాయ సేవా కేంద్రం సూపరిండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

మలేరియా మరణాలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మలేరియా వ్యాధితో ఎవరు మరణించకుండా చూడాలని వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బొర్కాడే అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీకి జిల్లా వైద్యాధికారి రామకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ గిరిజనులు నివాసం ఉంటున్న నేపథ్యంలో మలేరియా వ్యాధి పట్ల వారికి అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో నివారించేలా చూడాలన్నారు. అధిక మొత్తంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు ఉండకుండా గంబూజియా చేపలు వేసినట్లయితే దోమల నివారణకు దోహద పడతాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం నాలుగు లక్షల 35 వేల మంది మలేరియా వ్యాధి బారినపడి మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించినట్లు గుర్తు చేశారు. ఇటువంటి మహమ్మారిని తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మలేరియా నివారణ కోసం 30 సంవత్సరాల కిందటే ప్రత్యేకంగా మందు కనిపెట్టినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి ఆవరణలో చెత్తాచెదారం ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే నీటినిలో ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేసేలా చూడాలన్నారు. దోమల నివారణ కోసం యాంటీ లార్వా కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారులు సుధాకర్ నాయక్, వైద్యులు సత్యనారాయణ, సిబ్బంది రషీద్, ఆసీస్ పాల్గొన్నారు.



మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ



నవతెలంగాణ-కెరమెరి

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఆస్పత్రి సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆస్పత్రి నుండి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి దోమల నివారణకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి వాటి పై ప్రజలను చైతన్య పర్చడంతో మలేరియా వ్యాప్తిని అరికట్టడడంలో మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మలేరియా కేసులు నమోదు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ఖలీల్ హుస్సేన్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి మెరిట్ స్కాలర్షిప్ చెక్కులను అందజేశారు. తిరుపతి ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న వ్యాసభట్ నిఖిల్ శ్రీకృష్ణ తండ్రి రాధా కృష్ణ (ఆర్కే-6 గనిలో జూనియర్ అసిస్టెంట్) రెండవ సంవత్సర సెకండ్ సెమిస్టర్ మెరిట్ స్కాలర్షిప్ రూ.1,10,100 చెక్కును, అలాగే హైదరాబాదులోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్న ఆవుల ఆకాంక్ష తండ్రి ఆవుల కొమురయ్య (ఇందారం ఉపరితల గనిలో ఈపి ఫిట్టర్) మొదటి సంవత్సరం మెరిట్ స్కాలర్షిప్‌ను రూ.10,000 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్‌లను అందజేయడం చాలా సంతోషకరమైన విషయమని, వీరు ఉన్నత చదువులు చదివి సంస్థకు, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. దేశ విదేశాలలో సింగరేణి సంస్థలో పనిచేసిన ఉద్యోగుల పిల్లలు వివిధ హోదాలలో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషకరమైన విషయమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, డీజీఎంలు పి.అరవిందరావు, శివ రావు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీఓలు కాంతారావు, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా బలరాం నాయక్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి పేషెంట్స్ ఆరోగ్య పరిస్థితులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకొని, ఫార్మసీ స్టోర్ పరిశీలించి అన్ని రకాల మందులు ఉన్నాయా లేవా అని నిర్ధారణ చేసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఎండాకాలంలో పేషెంట్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జీఎం ఎస్.మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం ఓదెలు, డీవైసీఎంఓ ఉష పాల్గొన్నారు.

మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట-2 ఇంక్లైన్ గని మేనేజర్‌గా జీ.లక్ష్మి నారాయణ మంగళవారం భాద్యతలు స్వీకరించారు. మేనేజర్‌కు గని అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం కాసిపేట-2 మేనేజర్‌గా పని చేసి పదోన్నతిపై మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా వెళ్తున్న మాటూరి రవీందర్‌ని గని అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో గ్రూప్ ఏజెంట్ కూర్మ రాజేందర్, మైన్ సేఫ్టీ ఆఫీసర్ ఈ.సంతోష రావు, పిట్ ఇంజినీర్లు బొద్దిరెడ్డి రఘు, నంద కిషోర్, వెల్ఫేర్ ఆఫీసర్ కళ్లేపెళ్లి భార్గవ్, సర్వే ఆఫీసర్ దుస్సా ప్రకాష్ రావు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధర్యంలో స్థానిక కుమ్మరికుంట వార్డు నెంబర్ 6లో నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దోమల వలన వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ముందస్తు ప్రణాళికలతో వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పంచాయతీ, వైద్యారోగ్యం, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో గ్రామాలలో విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా విషజ్వరాలను నియంత్రించడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా వార్డులోని పలు ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కూలర్లలో నీటి నిల్వలను తొలగించారు. ప్రతి ఫ్రైడే డ్రై డే పాటించాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా తొలగించాలని అన్నారు. అలాగే మురికి నీటి కాలువలలో బ్లీచింగ్ చేయాలనీ కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మలేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.సాధన, మున్సిపల్ కమిషనర్ శైలజ, వైద్యులు శ్రీనివాస్, విజయ సారధి, అలేఖ్య, శ్రీధర్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ముత్నూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వైద్యులు డా.శ్రీకాంత్,ప్రియాంక ఆధ్వర్యములో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మలేరియా పరాన్న జీవిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.మలేరియా వ్యాధి సోకకుండా దోమ తెరలు వాడాలని, ఇంటి చుట్టూ పక్కల పరిశుభ్రత పాటించడం వలన మలేరియా సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు సుగుణ,సముద్ర,సర్పంచ్ భాగుబాయి,జంగు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్ : ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని పీహెచ్ డాక్టర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాస్ డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండలంలో దోమలతో వ్యాపించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మలేరియా వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌హెచ్‌పి మనీషా, ఏఎన్ఎం సుమంగళ పాల్గొన్నారు.

బెజ్జూర్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బెజ్జూర్ వైద్యాధికారి డాక్టర్ సుంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి బస్టాండు ఏరియా వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి నివారణకు దోమలే కారణమని, దోమలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో నీటి గుంతలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి గుంతల వల్ల దోమల వ్యాప్తి పెరుగుతుందని, దీంతో రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ రేణుక, ఎల్‌టీ దిలీప్‌కుమార్, ఏఎన్ఎంలు రాంబాయి, సునీత, సైదమ్మ, మేఘన, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో యూత్ జోడో బూత్ జోడో



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నాగారం గ్రామంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి ఆదేశాల మేరకు వేమనపల్లి మండల యూత్ ఇన్‌ఛార్జి ముల్కల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమడుగుల మహేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వాటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ వల్ల యువత జీవితాలతో ఆడుకుంటుందని, వారి తల్లిదండ్రుల ఆశలని అడియాశలు చేసే విధంగా ఉన్న ప్రభుత్వ అనాలోచిత విధానాలను వివరించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే గ్రామాల్లోని యువత చైతన్యవంతులై ముందుకు వచ్చి ప్రజల్లోకి వెళ్లి ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలను వివరించి రాబోయే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించే విధంగా సన్నద్ధం కావాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు యాదండ్ల బాలు, భోగ శ్రావణ్, డాగయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT:: ADILABAD
SUCCESSION O.P.NO. 2/2023
BETWEEN:
Nusrath Begum
...Petitioner
// AND //
To whomsoever it may concerned
...Respondent
To
To Whomsoever it may concern
Whereas the above named petitioner filed the above O.P., for grant of Succession Certificate in his favour to to receive the compensation amount of Rs. 5,64,230/- (Rupees Five Lacks Sixty Four Thousand Two Hundred Thirty only) against my father's land acquired to an extent of Ac. 0.04 Gts in Sy.No. 116/1 situated at Village Tulana, Taluqa Rajura, Dist. Chandrapur, Maharashtra State., in which the respondent is to whomsoever it may concern i.e. public in general, and the matter stands posted on 27.04.2023 at 10.30 A.M., for appearance of interested parties if any, and if anybody has got any objection, in granting Succession Certificate in favour of the Petitioner by this Hon'ble Court, they can appear before the Hon'ble Court to make their objections, failing which the matter will be heard and decided ex-parte, according to law.
// BY ORDER OF THE COURT//
NEHEMIAH DAYAKAR PEDDELLI & GHANSHYAM
ADVOCATES, ADILABAD

నూతన పర్యావరణ పరిరక్షణ నియమావళి ఉపసంహరించుకోవాలి

- ఉట్నూర్‌కు రెగ్యులర్ ఐటీడీఏ పీఓను నియమించాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్
- ఘనంగా టీఏజీఎస్ జిల్లా మూడో మహాసభలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవినుండి దూరం చేసే విధంగా ఉన్న నూతన పర్యావరణ పరిరక్షణ నియమావళిని ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. ఉట్నూర్‌కు రెగ్యూలర్ ఐటీడీఏ పీఓను నియమించాలని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో టీఏజీఎస్ జిల్లా మూడో మహాసభలు ఘనంగా నిర్వహించారు.



తొలుత జిల్లా అధ్యక్షుడు ఆత్రం కిష్టన్న జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవుల నుండి ఖాళీ చేసే విధంగా నూతన పర్యావరణ చట్టం తీసుకొచ్చి ఆదివాసులకు ద్రోహం చేస్తుందని తెలిపారు. ఆదివాసులను అడవికి దూరం చేస్తే సహించేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు రూపకల్పన చేస్తామని వెల్లడించారు. ఆదివాసులకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసి గిరిజన విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రిమోట్ ఏరియా అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 25మందితో కూడిన జిల్లా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఉయిక విష్ణు, ప్రధాన కార్యదర్శిగా రెండోసారి పూసం సచిన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు ఆత్రం కిష్టన్న, బైరి సోమేష్, ఆత్రం తనుష్, లంకా రాఘవులు, ఆడ అర్జున్, పూసం గణేష్, దుర్వ రామ్ చందర్, రాజు, మేస్రం సురేష్ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-బోథ్

వివోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త పశుల చంటి అన్నారు. మండల కేంద్రంలో వివోఏలు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వివోఏలు చేపడుతున్న సమ్మెను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గౌరవ వేతనం రూ.26వేలు చెల్లించి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మహమ్మద్, సల్ల రవి, గంగారెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్ : ఐకేపీ విఓఎల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని బీజేపీ నాయకులు వీరయ్య అన్నారు. ఐకేపీ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉండరని, అందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పిన కేసీఆర్ తొమ్మిదేండ్లు గడుస్తున్నా వాటి ఊసెత్తడం లేదని విమర్శించారు. ఇకనైనా కళ్లు తెరిచి చాలీచాలని వేతనాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్న ఐకేపీ సిబ్బందికి కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వెలిశాలి తిరుమలచారి, మండల ఉపాధ్యక్షులు శేఖర్‌గౌడ్, కాల్వ నరేష్, మలక్ చించొలి ఉపసర్పంచ్ గంగాధర్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మునిమనకల లక్ష్మణ్, నర్సయ్య, పాల్గొన్నారు.

వాంకిడి : తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ వీఓఏల సమ్మె ఐకేపీ కార్యాలయం ముందు కొనసాగుతోంది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగించడం జరుగుతుందని వీఓఏలు తెలిపారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

బెజ్జూర్ : మండలకేంద్రంలోని ఐకేపీ వీఓఏలు నల్లబ్యాడ్జీలతో కండ్లకు గంతలు కట్టుకొని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వీఓఏలలు చేపడుతున్న సమ్మె మంగళవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు విజయ్,కార్యక్రమంలో శంకర్, విలాస్, సుజాత, మాధవరావు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలో వీఓఏల సమ్మెకు బీఎస్పీ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తెర్ల లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం దీక్ష శిబిరానికి చేరుకొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని చిన్నస్థాయి ఉద్యోగులని చిన్న చూపు చూడటం సరికాదని కనీస వేతనాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ మెస్రం జంగుబాపు, ప్రేమకల, ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షురాలు మెస్రం మీనా, వీఓఏలు వినోద్, కాడే రామన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న వీఓఏలకు మంగళవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం వారి సమ్మెకు అయ్యే ఖర్చులకు సర్పంచ్ వీరేష్ కుమార్ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మా కష్టాలు తీరుతాయని అనుకుంటే ఇంకా ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో డ్వాక్రా, మహిళా గ్రూపుల ఏర్పాటులో వాటి పటిష్టతలో, ఆర్థికంగా ఎదుగుదలలో వీవోఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం రూ.3900 రూపాయలు మాత్రమే గౌరవ వేతనం ఇస్తున్నారన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్, ఎఫ్ఎసిఎస్ డైరెక్టర్ రాజలింగం, కోడె ముత్యం, ఉద్గిరి సాయి, మధు, గోపు రాకేష్, మున్కు సాయారెడ్డి, నవీన్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ముథోల్ ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకుంది. వర్షం కురిసినప్పటికీ సమ్మె శిబిరంలో వర్షంలో తడుస్తూ తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వీఓఏల అధ్యక్షుడు రాజు, కార్యదర్శి కేరిభా, కోశాధికారి శ్రీలత, సలహాదారులు పోశెట్టి, వీఓఏలు, రాధ, శోభ, సవిత, లత, రాజు, దేవేందర్, సాయినాథ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం

- మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయే
- కాంగ్రెస్, బీజేపీలు ప్రజల నమ్మకాన్ని కోల్పోయాయి
- ప్రతినిధుల సభలో ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు



నవతెలంగాణ-హాజీపూర్

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. రానున్న ఎన్నికలకు బీఆర్ఎస్ ప్రతినిధుల సభ సమరశంఖాన్ని పూరిస్తుందని పేర్కొంటూ మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్రావు జోస్యం చెప్పారు. మంగళవారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని పద్మావతి గార్డెన్‌లో భారీ ఎత్తున నిర్వహించిన బీఆర్ఎస్ ప్రతినిధుల సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముందుగా ప్రతినిధుల సభా ప్రాంగణంలో బీఆర్ఎస్ పతాకాన్ని ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మొదటగా పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు ప్రధానంగా రైతాంగానికి ఎంతో మేలు జరిగిందని అన్నారు. వ్యవసాయ రంగంలో నూతన ఒరవడితో అభివృద్ధి సాధించి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడిందని అన్నారు. వ్యవసాయ, ఆరోగ్య, సంక్షేమ, పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో బంగారు తెలంగాణగా కీర్తి గడిస్తుందని అన్నారు. అనంతరం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ ప్రజలు పట్టం కట్టబోనున్నారని అన్నారు. పార్టీ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారాయని, అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణలో ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా మనుగడ సాధించలేరన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడి సభ జనాలు లేక వెలవెలబోయిందని దీంతో ప్రజల్లో ఆ పార్టీకి ఎంత ఆదరణ ఉందో తెలుస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభను చూస్తే కాంగ్రెస్ వెన్నులో భయం తప్పదని ఎద్దేవా చేశారు. ఇక బీజేపీ పార్టీ దేశ అభివద్ధిని విస్మరిసస్తూ కార్పోరేటుకు వత్తాసు పలుకుతోందని అన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తు ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని పేర్కొంటూ బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలని అన్నారు.

తీర్మానాలు ప్రవేశపెడుతూ.. బలపరుస్తూ..

బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆదేశాల మేరకు వ్యవసాయం-రైతు సంక్షేమం, సింగరేణి గనుల వేలం, కేసీఆర్ వరాలు, ఇండ్ల పట్టాలు, మహిళా శ్రేయస్సు, ధరల పెరుగుదల-మోదీ వైఫల్యం, నూతన సచివాలయం-అంబేద్కర్ పేరు, ఎల్లంపల్లి ప్రాజెక్ట్, మేడిగడ్డ, గూడెం, పద్దనపల్లి లిఫ్ట్, పల్లె, పట్టణ ప్రగతి, మంచిర్యాల మెడికల్, నర్సింగ్ కళాశాల తదితర అంశాలపై పార్టీ ప్రతినిధులు తీర్మాణాలు ప్రవేశపెట్టగా పలువురు బలపరిచారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సభలో మున్సిపల్ చైర్మన్లు పెంట రాజయ్య, నల్మాసు కాంతయ్య, ప్రభాకర్, వైస్ చైర్మన్లు ముఖేష్ గౌడ్, తోట శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పల్లె భూమేశ్, సాగి వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు మందపల్లి శ్రీనివాస్, పూస్కూరి శ్రీనివాసరావు, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, సుదమల్ల హరికృష్ణ, గాదె సత్యం, ఆరె శ్రీనివాస్, పడాల రవి, మొగిళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శిక్షణ, ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్ పాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళా ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మెగా జాబ్ మేళాలో 1200 మంది నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 510 ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. హెట్రో డ్రగ్, హ్యాపీ మొబైల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, అపోలో ఫార్మసీ, డీ మార్ట్, రిలయన్స్ జియోమార్ట్, ముత్తూట్ గ్రూప్స్, అరబిందో ఫార్మా తదితర 42 కంపెనీలు సుమారుగా 3500 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. జిల్లాలోని యువతి యువకులు 10వ తరగతి నుంచి పీజీ వరకు అర్హత గల వారికి ఉద్యోగ అవకాశాలు, మంచి జీతంతో తెలంగాణలోని అన్ని ప్రాంతాలలో పనిచేసేందుకు వివిధ కంపెనీలు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన తరువాత శిక్షణ ఇచ్చి కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని, కంపెనీలు ఉపాధి అవకాశాలు కల్పించి యువతి యువకులకు ఉద్యోగాలు అందించడం సంతోషంగా ఉందని, యువత భవిష్యత్తుకు మంచి అవకాశమని, ప్రారంభంలో కొంత ఇబ్బంది ఉంటుందని, అలవరచుకుని ముందుకెళ్తే ఎన్నో మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాదులో అనేక కంపెనీలలో అర్హతను బట్టి ఎక్కువ అవకాశాలు ఉన్నందున ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, జిల్లా గిరిజన అభివద్ధి అధికారి మణెమ్మ, మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ రబ్బాని, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుతో యువకుడు మృతి

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్



పిడుగు పాటుకు యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో రాజురా గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజురా గ్రామశివారులో మంగళవారం అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా పిడుగు పడటంతో మేకల కాపరి పాతకుంట మోహన్(21) ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు బలయ్యాడు. మేకలు కాస్తున్న క్రమంలో వర్షం కురియడంతో చెట్టు కిందకు వెళ్లిన మోహన్ పిడుగు పాటుకు బలయ్యాడు.

ఘనంగా బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జెండాను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ కొర్వా శ్యామ్, బీదరెల్లి గ్రామంలో ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్, అమృత పటేల్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ రావు, బీదరెల్లి, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బేల బంద్‌కు సహాకరించాలి

నవతెలంగాణ-బేల

బేల సమీపంలోని బూరాన్‌పూర్ శివారులో ఇటీవల ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఆదివాసీ ఆరాధ్య దైవమైన కుమురం సూరు, రాంజీగోండ్ జెండాలను తొలగించి తమ మనోభావాలను దెబ్బతీయడాన్ని నిరసిస్తూ బుధవారం బేల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు ఆడ శంకర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూరాన్‌పూర్ శివారంలో వెలసిన అక్రమ ఇండ్లతో పాటు స్థలాలను అక్రమంగా ఆదివాసీ చట్టాల విరుద్ధంగా వెలిసినందుకు తొలగించాలని ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించిన ఫలితం లేకపోవడంతో, ఈ నెల తొమ్మిదిన ఆదివాసీ ఆరాధ్యా జెండాలను తొలగించి కించపరిచే విధంగా వ్యవరించడం పట్ల నిరసనగా బేల మండల కేంద్రం బందుకు పిలుపు నిస్తున్నట్టు తెలిపారు. ఈ బంద్‌కు ప్రతి ఒక్క వ్యాపార, వాణిజ్య సంస్థలు సాకరించి బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేల మండల ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ పోసాని భూమన్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్, మెడికల్, ఆశా సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పశువుల వార సంత వేలం పాట

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని హుడ్కిళి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే పశువుల వారసంత వేలం పాటను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి దిలీప్ సర్కార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల వారసంత వేలం పాటను గతంలో రెండుసార్లు నిర్వహించగా సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో తిరిగి మూడోసారి వేలం పాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వేలం పాట ఉదయం 11:30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉంటుందని ఆయన తెలిపారు. ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

రాంటెక్ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడిని పరిష్కరించాలి

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని రాంటెక్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత నాలుగు నెలలుగా నీటి ఎద్దడి నెలకొందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నీటి సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించిన పరిష్కారం కావడం లేదని వాపోయారు. ఎస్సీ కాలనీలో నీటి సరఫరా లేక పోవడంతో కాలనీకి చెందిన ఓ రైతు తన మోటర్ ద్వారా కాలనీకి నీటి సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కాలనీలో ఉన్న బోరుబావి చెడిపోయినప్పటికీ ఎవరు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. గతంలో బోరుబావి చేడిపోతే కాలనీవాసులు తమ సొంత డబ్బులతో బాగుచేయించుకున్నామని తెలిపారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని తమ కాలనీకి నీటి సరఫరా చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని డైరెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నస్పూర్

మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ సబ్ కమిటీ మైనింగ్ స్టాఫ్ నాయకులు డైరెక్టర్(ఫైనాన్స్) బలరాంకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటీకే-8 ఇంక్లైన్‌లో జరిగిన ప్రమాదానికి బాధ్యుల్ని చేస్తూ ప్రకాష్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదని, గతంలో మైనింగ్ స్టాఫ్ పోరాటం చేశామని తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా సమాన హోదా కల్పిస్తూ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్, అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న ఓవర్ నెలకు ఓపెన్ కాస్ట్‌లో కౌన్సెలింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామనితెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సబ్ కమిటీ బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ ఇన్‌ఛార్జి వంగరి రాజేశ్వరరావు, మందమర్రి ఏరియా ఇన్‌ఛార్జి గోపతి సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఇన్‌ఛార్జి, మారేపల్లి బాబు పాల్గొన్నారు.

కృష్ణపెల్లిలో కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

నవతెలంగాణ - బెజ్జూర్



పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో కృష్ణపెల్లి గ్రామంలో కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. కృష్ణపెల్లిలో 160 కుటుంబాలను కుష్టి వ్యాధిపై సర్వే చేశారు. అందులో ముగ్గురు అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ రమేష్, హెచ్‌ఈఓ కోటేశ్వర్, స్టేట్ టీం సభ్యులు సురేందర్, వెంకటేశ్వర చారి, శ్రీనివాస్‌రెడ్డి, జోసెఫ్, హెల్త్ అసిస్టెంట్ ధర్మయ్య, ఏఎన్ఎం మీరా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.